


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

## -180-

(16 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"తనకు మాలిన ధర్మం** – మొదలు చెడ్డ బేరం" అని సామెత వుంది మనకు ఈ సామెత చక్కగా ఆచరణలో పెట్టేవారు కొందరుంటారు. వారి కార్యదీక్ష చూస్తే ఎంతో ముచ్చట వేస్తుంది.

"సాయంత్రం అయిందిగా – కొంచెం అలా షికారు వస్తారా?" అని ఎవరైనా పిలిస్తే "వద్దామనే వుందిగాని – ఈ పూట కుదిరేటట్లు లేదు. ఇంట్లో కొంచెం పని వుంది. అది ఈ పూట చేసి పారేస్తే రేపటినుంచి బోలెడు విశ్రాంతి. హాయిగా తిరగొచ్చు. మీరు వెళ్ళిరండి" అని చల్లగా సాగనంపుతారు.

మరోరకం వ్యక్తులుంటారు. వారు అవతల వ్యక్తి పిలవగానే "అలాగే వెడదాం దానికేం. వస్తున్నా అయిదు నిమిషాల్లో వస్తున్నా"అంటూ లోపలికి పరుగెత్తి "ఇదుగో! నిన్నే పున్నయ్యగారు షికారు రమ్మంటారు. ఒక్క గంట అలా వెళ్ళి చక్కావస్తా.. బాగుండదు వెళ్ళకపోతే. పెద్దమనిషి వాకిట్లోకి వచ్చి పిలిచాడు, ఎప్పుడూ రానివాడు వచ్చాడు. వెళ్ళొస్తా"నంటాడు. చొక్కా తొడుక్కుంటూ.

"అదేమిటండీ అంత హఠాత్తుగా బయలుదేరుతున్నారు. ఈపూట ఇంట్లోకి కావలసిన వెచ్చాలు తెస్తానంటిరి. పిల్లవాణ్ణి డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళి జలుబుకు మందు తెస్తానంటిరి. ఇవన్నీ వదిలి వెడతానంటావేమిటి?" అని ఇల్లాలు గొడవ పెడుతుంది.

"అన్నాననుకో. కాని ఆయన పిలిచాడు. పెందరకాడే తిరిగివస్తే వెచ్చాలు తెస్తాను. పిల్లాణ్ణి పోనీ నువ్వు డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళు. వెళ్ళకపోతే బాగుండదు" అంటూ తొడుగుతాడు.

"మీకు నిజం చెపుతున్నా. డాక్టరు దగ్గరికి నేను వెళ్ళను. నాకీ పూట అసలు ఓపిక లేదు. పిల్లాడు జలుబుతో మూలుగుతాడు. మీరిలా వెళ్ళడం మాత్రం బాగుండలేదు. పనిలేని వాళ్ళకు షికారు కాని పనున్న వాళ్ళకు ఎలా కుదురుతుందండీ. షికారుకు కావలసిన హుషార్ ఎలా వస్తుంది మీకు?" అని ఆమె గుమ్మందాకా తరుముతుంది.

మాట్లాడవద్దు. ఆయనకు వినపడుతుందన్నట్లు చెయ్యి వెనక్కి పెట్టి సంజ్ఞ చేస్తూ బయటకి పోయి పున్నయ్య వెంట పడతాడు ఇకిలిస్తూ. ఆవిడ పళ్ళు కొరుకుతూ తలుపు గభాల్న వేసుకుంటుంది.

చాలామంది పరాయివాళ్ళకోసం తాపత్రయ పడటం అనేది గొప్ప గుణంగా భావిస్తూ వుంటారు. అలాటి స్వభావంగల వాళ్ళకు పనులు పురమాయించడం వల్ల ప్రయోజనం వుంటుందనే సత్యం ఊరందరికీ తెలిసిపోతుంది.

మా వూళ్ళో ఒక పెద్ద మనిషి వుండేవాడు. ఆయనగారికి ఇలాటి సేవలంటే ఎంతో యిష్టం. ఆయన భార్య పోయింది. వంటరిగా వుండి వండుకుని తింటూ వుండేవాడు. ఇతరుల పనుల మీద తిరుగుతూ వుండటం వల్ల ఒక్కరోజు కూడా వంట సరిగ్గా సాగేది కాదు. ఒకప్పుడు పొయ్యిమీద బియ్యం నాని, అన్నం వాము సుద్దలాగా అయ్యేది. ఒకప్పుడు నీళ్ళు చాలక మేకులల్లే తయారయ్యేది. ఇంటికొచ్చి చూసి మళ్ళీ వండుకోవడానికి బద్దకించి మడత మంచం వాల్చుకుని అలాగే పరుండేవాడు పాపం.

ఆయన చేసే సేవలెలా వుంటాయో చూడండి.ఎవరైనా వచ్చి "చలపతిరావుగారూ చిన్న సలహా చెప్పండి. ఇవ్వాళ మా యింట్లో ఆబ్దికం. పిండాలు ఆవుకు పెట్టాలని వుంది. ఆవు ఎక్కడా దొరకడం లేదు. అవి గోవుకి తినిపించాలి నేను ఆఫీసుకి వెళ్ళాలి. ఒకపూట సెలవుపెట్టా అంటాడనుకోండి.

చలపతిరావుగారు ఆశ్చర్యంగా చూస్తూ "అదేమిటి ఆవు దొరక్కపోవడమేమిటి? మీకెందుకు మీరు మీ పనిమీద ఉండండి. పన్నెండింటికల్లా గోవు మీ గుమ్మంలో వుంటుంది ఏం చాలా? ఇంకా పెందరాళే కావాలా? " అంటాడు.

"పన్నెండింటికి వుంటే చాలు. అంత కన్నా ముందెందుకు? " అంటాడు వచ్చిన ఆ పెద్ద మనిషి.

"అయితే మీరు వెళ్ళండి. మీ పనిలో వుండండి అని పంపి" తను ఆవును సంపాదించి తోలుకు రమ్మని ఆ యజమాని చేతిలో ఒక అర్ధ రూపాయి పెట్టి, మళ్ళీ పన్నెండు గంటలకు తనిఖీకి వెళ్ళి గోవు పిండాలు తిన్నదాకా దగ్గర వుండి, దాన్ని మళ్ళీ తోలి పంపించి ఇంటికి వచ్చేవాడు చలపతిరావు.

ఆవు పిండాలను హరించుకునేదాకా వుండాలని మాత్రం తట్టేది కాదు. ఆవుకు ఆహారం, తద్దినం పెట్టిన గృహస్థుకు ఆత్మ సంతృప్తి కల్పించి తను ఎండకొట్టి ఇంటికి వచ్చి మొండి కట్టిలాగా మడతమంచం మీద వ్రాలి ఒక మంచిపని చేశానివ్వాళ, ఆ యజమాని ఆత్మ ట్యూబ్ లైటులాగా వెలిగి వుంటుందనే సంతోషంలో మునిగిపోయేవాడు.

ఎవరన్నా వచ్చి "మా అమ్మాయి ప్రసవమైంది. గుమ్మానికి కలబంద కట్టాలి. ఎక్కడుందో తెలియదు. మా ప్రక్కయింటి బామ్మగారు మీకేందుకు శ్రమ చలపతిరావుగారిని అడగండి క్షణంలో చెపుతారండి. ఆ మాట వ్ని పరిగెత్తుకొచ్చాం" అంటారనుకోండి...

"కలబందేకదా! ఎక్కడో చూశా. దగ్గిరలోనే వుంది పిల్ల సుఖ ప్రసవమైందా? ఏం పిల్లాడు? పాత చెప్పు సంపాదించారా? అదికూడా పంపనా? నేను జ్ఞాపకం చేసుకుని కలబంద అరగంటలో అందిస్తా. మీరు తక్కిన పనులు చూసుకోండి" అని చెప్పి పంపించి –

కాస్త కాఫీ కాచుకుని నోట్లో పోసుకుని, తలుపులు తాళాలు పెట్టి, పన్నుకర్ర చేత్తో పట్టుకుని బలాదూర్ బయలుదేరేవాడు. కలబంద జపం చేస్తూ గట్లన్నీ తిరిగేవాడు. అవసరాన్ని బట్టి పొరుగూరు కూడా వెళ్ళేవాడు. మొత్తానికి మూడు పురుళ్ళకు సరిపడ్డ కలబంద మూట కట్టుకు తెచ్చి పురుటిగది ముందు పడేసి "కొంచెం ఆలస్యమైంది. దగ్గిరలోవున్న కలబంద ఎవరో తవ్వేశారంట. పరోపకారం తెలియని నిర్భాగ్యులు. వాళ్ళనేం అనాలో తోచడం లేదు. గుమ్మానికి కట్టనా?" అనేవాడు.

"వాళ్ళు అయ్యో కష్టపడి తెచ్చింది కాక, ఇంకా కట్టడం పనికూడా మీకేనా? వద్దండి.. మీ పుణ్యం మరిచిపోం? వెళ్ళి రండి" అని పంపేవారు.

ఆయనకు వెంటనే వెళ్ళడం ఇష్టం లేక "పెద్ద మట్టలున్నాయి చూచి కట్టండి" అని ఏవేవో సలహాలిచ్చి వెళ్ళేవాడు.

"త్రోవలో ఎవరికైనా అవసరమొస్తుంది? కాస్త చెయ్యకపోతే ఎలా?" అనేవాడు.

"చెయ్యకపోతే ఎలా? అసలు మీ పేరే సహాయం అందులో ఉచిత సహాయం అనేవార"ది విన్నవారు. కలబంద గొడవలో కడుపు మాట మరిచిపోయేవాడు.

ఇలాటి తనకు మాలిన ధర్మాలు అనేకం వుంటాయి లోకంలో. వాటిని అవలంబించే వ్యక్తులు చక్కటి పాత్రలుగా రూపొందుతారు. ఇలాటి వింత పాత్రలు మరికొన్ని ఈసారి.

Post your comments